# అంతర్యాలు

వాసు, కామేశం, టెన్నీసు ఫైనల్సు ఆడుతున్నారు. ఇద్దరూ పేరుమోసిన ఆటగాళ్లే. అవుతే, వాసుకి ప్రేక్షకుల ప్రోత్సాహం కాస్త అధికంగా వుంది. అందుకు ప్రత్యేక కారణాలు యేమీ లేవు. క్రితంసంవత్సరం కామేశం ఛాంపియన్ అయ్యాడు. మళ్లీ యీ సంవత్సరం కూడా అతను గెలవడం యిష్టంలేదు, కొత్తదనం కావాలనుకొన్న కొందరికి.

కామేశం దురదృష్టంవల్లనైతేనేం, ప్రోత్సాహం కొరవడటంవల్లనైతేనేం ఓడిపోయాడు. వాసు విజయుడయ్యాడు.

అసంఖ్యాకమైన స్నేహితులూ, అభిమానులూ వచ్చి వాసుని అభినందించారు. కొద్దిమంది మిత్రులు మాత్రమే కామేశం దగ్గరికివచ్చి, అతను ప్రదర్శించిన నేర్పును ప్రశంసిస్తూ దురదృష్టానికి సానుభూతి ప్రకటించారు. అలా సానుభూతి ప్రకటించినవారిలో అనూరాధ ఒకామె.

ఒకక్షణం తర్వాత అనూరాధ "కంగ్రాచ్యులేషన్స్ మిష్టర్ వాసూ! చాలా బాగా ఆడారు" అంది అభినందిస్తూ.

వాసు, తనకళ్ళను తనే నమ్మలేకపోయాడు. యెదురుగా నిల్చునివున్న అనూరాధ మాటలు వింటూనే వుబ్బితబ్బిబ్బయి

పోయాడు. తనకి అభినందన తెలిపిన స్నేహితులూ, అభిమానులూ ఒకవంతు; ఒక్క అనూరాధ ఒకవంతూ అతని దృష్టిలో. కామేశంతో కలిసిమెలిసి తిరిగే అనూరాధ, తన దగ్గరికివచ్చి, తన ప్రతిభను ప్రశంసించడం, అతనికి మరీ వుత్సాహం కలిగించింది. ఆమె మొహంలోకి ఒక్క తృటికాలం వీక్షిస్తూ ఉండిపోయాడు. ఓహ్! యేం అందం, యేం ఆకర్షణ! ఆమె మృదుమధుర గొంతు నుండి తనకు అభినందన లభ్యం కావడం యెంత అదృష్టం ... అనుకున్నాడు. "థేంక్యూ, థేంక్యూ! మీ అభిమానానికి ధన్యవాదాలు అనూరాధ గారూ!" మందహాసంతో అన్నాడు వాసు.

అక్కడే నుంచునివున్న వాసు స్నేహితులు మొహాలు చూసుకున్నారు.

కాస్త దూరంలోఉన్న కామేశానికిమాత్రం అనూరాధ ప్రవర్తన యేమీ నచ్చలేదు. అవుతే, యీ యిరవయ్యో శతాబ్దపు నాగరిక సమాజంలో తను యిటువంటి విషయాన్ని పట్టించుకోవడం కూడా తన బలహీనతేనేమో! అదీగాక ఆమె యింతవరకూ తన గృహిణికాలేదు. కొద్దిరోజుల్లో కాబోతుంది. అప్పుడే తను అధికారం చెలాయించ బూనితే అసభ్యంగా వుండడమే కాకండా, పరిస్థితులు తారుమారు కాగల అవకాశా లున్నాయని అతనికి అనిపించింది.

వాసుకి మిత్రులెవ్వరూ దృష్టిపథంలోకి రాలేదు. వారి అభినందనలూ, ఆశీర్వాదాలూ, గుర్తుకు రాలేదు. అతని

మనసులోనూ, కళ్ళల్లోనూ మెరుస్తున్నది ఒక్క అనూరాధ మాత్రమే! అతని చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నది ఆమె మృదు మధుర అభినందన మాత్రమే.

ఇతఃపూర్వం వాసు యెన్నో సార్లు అనూరాధను చూశాడు. ఒక్కొక్కప్పుడు ఆమె కామేశంతో మాట్లాడు తున్నప్పుడు, అతనితో షికార్లకు పోతున్నప్పుడు, అసూయ పడినరోజులు కూడా లేకపోలేదు. కాని, ఆమె యెప్పుడూ యింతగా అతణ్ణి ఆకర్షించలేదు. అసలు నిజం చెప్పుకోవాలంటే, ఆమె అభినందనే ఆశల్ని రేపింది. మత్తెక్కించింది. ఆమెకి తనపట్ల యిప్పుడిప్పుడే అభిమానం పుంజుకుంటుందని వూహించ డానికి అతనికి యెంతో సమయం పట్టలేదు. నిజంగా ఆమె అభిమానానికి పాత్రుడవ్వడం తన అదృష్టమే. ఆ అభిమానమే ప్రేమగా మారితే, తనకింక కావల్సిందేవిటి?...అనుకున్నాడు.

ఆరోజంతా వాసు అనూరాధ గురించే ఆలోచించాడు. ఆమె తనపట్ల ప్రదర్శించిన అభిమానం గురించే తలపోశాడు. ఆరోజు తనకి విజయం కలగడం, ఒక్క ఆటలోనే కాదు; జీవితంలోకూడా ఓ గొప్ప విజయాన్ని సాధించినట్టుగా భావించాడు. ఆ భావనే అతణ్ణి ఆనందంలో ముంచెత్తింది.

* * *

కామేశం ఆనాడు బాధపడినట్టు, జీవితంలో యెప్పుడూ బాధపడి యెరుగడు. ఆ బాధ వాసు చేత ఓడిపోయినందుకు కాదు. అనూరాధ, వాసును మెచ్చుకున్నందుకు! వాసుపై ఏ మాత్రం

సదభిప్రాయంలేని అనూరాధ, అతణ్ణి మెచ్చుకుందంటే, కారణం యేమైవుంటుందా అని మనసులో శోధించాడు. కారణం యేమీ కనిపించలేదు. కాని, ఒక్క అనుమానం తట్టింది. కొంపదీసి, అనూరాధ వాసుని ప్రేమించడం ప్రారంభించలేదుగదా! యీ అనుమానం, యీ సందిగ్ధత, అతని ఆలోచనలన్నింటిని త్రుంచి పారేసింది. హృదయాన్ని కలచివేసింది.

అవుతే, ధైర్యంచేసి యీ విషయాన్ని అనూరాధను అడిగేయడానికి యిష్టంలేకపోయింది. అంతకంటె ధైర్యం లేక పోయిందంటే బావుంటుంది. ధైర్యంచేసి అడిగినా, పరిణామం యేమిటా అన్నదే సమస్య. కాని, ఒక్కటిమాత్రం అతను నిర్ధారణ చేసుకున్నాడు. వాసు తనని ఓడించడంయొక్క ఫలితమే యిదనుకున్నాడు.

అనూరాధ చాలాకాలంగా కామేశంకి తెలుసు. ఆమెతో బాగా పరిచయం వుంది. దూరపు బంధుత్వం కూడా కలిసింది. అంతేకాదు, ఆమెనే వివాహం చేసుకోవాలన్న కోరిక కూడా వుంది. అతని కోరికను ఓసారి మాటల సందర్భంలో అనూరాధ అంగీకరించడం కూడా జరిగింది. అటువంటి అనూరాధ, మళ్ళీ మనసు మార్చుకుందా? ఆమె ఆంతర్యాన్ని తెలుసుకోవడం యెట్లా? అని ప్రశ్నించుకున్నాడు కామేశం. కాని, మార్గం కనిపించలేదు. ఏది యేమైనా తను వాసుని ఓడించితేనే గాని, తన మనసుకి తృప్తి లేదనుకున్నాడు. మరో క్లబ్బువారు ఏర్పరుస్తున్న పోటీలు గుర్తుకువచ్చాయి. ఆ పోటీలో నైనా వాసుని తను ఓడించాలి... అని నిర్ధారణ చేసుకున్నాడు.

ఈ నిశ్చయానికి వచ్చిన తర్వాత, కామేశం పట్టుదలతో ప్రాక్టీసు ప్రారంభించాడు. అతనికి తెలుసు—తను వాసుకంటె ఆటలో అగ్రగణ్యుడని; కానీ, ఆనాడు యెలా ఓడిపోయాడో అతనికే అంతుచిక్కలేదు. బహుశా, అదృష్టంకూడా కొంత కలిసిరావాలేమోననుకున్నాడు. అయినా ప్రాక్టీసు మానలేదు.

ఓనాడు అనూరాధ ప్రాక్టీసుకి పోతున్న కామేశాన్ని కలిసింది.

"అలా షికారుకి పోదాం రాకూడదూ?" అంది.

"నేను రాలేను అనూ, కోర్టుకి వెళ్తూన్నా."

"అయినా యింకెందుకీ ప్రాక్టీసు ?"

"తెలీనట్టు అడుగుతావేం ? కొద్ది దినాల్లో మరో టోర్నమెంటు జరుగుతుందిగా !"

"ఔనుకదూ; మర్చేపోయాను..." చిన్నగా నవ్వుతూ అనేసి, "అప్పుడుకూడా వాసే విజేత అవుతాడేమో ?" అంది కామేశం మొహంలోకి చూస్తూ.

కామేశం మనస్సు చివుక్కుమంది. ఎవరో కడుపులో చేయిపెట్టి దేవుతున్నట్లనిపించింది. బాధమాట యెలావున్నా, అప్రయత్నంగా అతనిలో కోపం ముంచుకొచ్చింది. అనూరాధ ధైర్యం యేమిటి? తన సమక్షంలోనే వాసుని పొగడ్డంలో యీమె అంతరార్థం యేమిటి ?

"అది నీకు సంతోషకరమైన విషయమేగా!" పుడుకుమోత్తనంతో, వుక్రోషం అణచుకుంటూ అన్నాడు, అనకూడదనుకునే.

అనూరాధ చిలిపిగా నవ్వింది. కామేశానికి కోపం వచ్చిందని కూడా ఆమెకి తెలుసు.

"నా సంతోషం మాటకేంగాని, నీ అపజయం గురించి ఆలోచించు" అంది.

కామేశం మండిపడ్డాడు లోలోన. "సరే, ఆ రోజు దగ్గరపడుతుందిలే వస్తా" అంటూ అనూరాధ వేపు యింక చూడనైనా చూడకుండానే వెళ్ళిపోయాడు.

కామేశం ధోరణికి అనూరాధ కాస్త కలవరపడింది. అయినా సరే, తన మనోభిప్రాయాన్ని అప్పుడే వ్యక్తంచెయ్యడం ఆమెకి యిష్టంలేక, చిన్నగా నవ్వుకుంటూ తన త్రోవన తను పోయింది.

రోజులు గడుస్తున్నాయి. పోటీలు దగ్గరపడుతున్నాయి. వాసుకూడా విసుగూ విరామం లేకండా ప్రాక్టీసు చేస్తున్నాడు. అతనిలోవున్న పట్టుదల యెదుటివారిని ఓడించాలన్న దానికంటె, ఓడించితే, అనూరాధను తృప్తిపర్చినవాడవుతాడన్న దే మిన్నగావుంది.

ఓనాడు అనూరాధ స్కూలునుండి తిరిగివస్తుంటే, వాసు యెదురయ్యాడు. ఆమెను చూడ్డంతోనే సైకిలు దిగాడు.

ఆ దుస్తులధారణ. చేతిలో టెన్నీసురాకెట్ చూస్తే, ప్రాక్టీసుకి పోతున్నాడని తెలిసిపోతుంది.

"నమస్తే!" అన్నాడు.

"నమస్తే" ముక్తసరిగా అంటూ ముందుకుసాగి పోయిందామె.

వాసు సైకిలు తిప్పాడు. ఆమెకి సమానాంతరంగా నడుస్తున్నాడు. అతను తనతో రావడం ఆమెకి యిష్టంలేదు. అయినా పొమ్మని, ఖచ్చితంగా యెలా చెప్తుంది?

"ఇప్పుడు వెళ్తున్నారా ప్రాక్టీసుకి?" అంది. అలా అంటే, అప్పటికే ఆలస్యమైనందుకు వెంటనే తిరిగిపోతాడను కుందామె. కాని, అలా జరగలేదు.

"ఔనండీ? కాస్త పనుండి ఆలస్యమయింది. అయినా, ఒక్కరోజు ప్రాక్టీసు లేకపోతే యేం పోయిందిలెండి..." ఎంతో ధీమాగా చెప్పాడు.

"కామేశం చాలా పట్టుదలతో ప్రాక్టీసు చేస్తున్నట్టు విన్నాను..."

"అది సహజంలెండి. ఎప్పుడూ మేమిద్దరమే ఫైనల్సు ఆడాలిమరి! ఆఁ....అన్నట్టు కాఫీ తీసుకుందాం పదండి." కాస్త దూరంలో కాఫీహోటలు చూసి అన్నాడు.

"అబ్బే...వద్దులెండి..." అనేసింది ముభావంగా.

వాసు నిరుత్సాహపడ్డాడు.

"సరే! మిమ్మల్ని బలవంతం చెయ్యడం, నాకు యిష్టం లేదు. పోనీ లెండి...మీరెప్పుడూ మా యింటికి రాలేదు... ఓ సారి రాకూడదా?" అన్నాడు.

వాసు అంత చనువుతీసుకుని మాట్లాడ్డం, అనూరాధకి కాస్తంత అసహ్యం కలిగించిందికూడాను. అయినా, యేమంటుంది? సభ్యత అడ్డొచ్చింది.

"అలాగే! యెప్పుడో వీలుచూసుకుని వస్తాలెండి..." లోలోపల తిట్టుకుంటూనే అంది.

ఆమె జవాబుకి కాస్తంత సంతోషించాడు వాసు. ఇద్దరూ కొద్దిసేపు మౌనంగా నడిచారు.

"నిజంగా మీరు నాపై చూపిస్తున్న అభిమానానికీ, అనురాగానికీ, యెంతో కృతజ్ఞుణ్ణి..." మళ్ళీ ప్రారంభించాడు వాసు.

అనూరాధ అతనివేపు తీక్షణంగా చూసింది.

వాసుమాత్రం అవన్నీ లెఖ్ఖ చెయ్యలేదు. తనమనసులోని మాటను వ్యక్తం చెయ్యాలని ఆ రోజు నిశ్చయించుకున్నాడు.

"మీవంటివారి ప్రోత్సాహం, సహచర్యం సదావుంటే, నేనింకా నా ఆటను యినుమడింపజేసుకోగల ననుకుంటాను..." అన్నాడు.

అతనిమాటల పొందికలో, అతని స్వార్థం చూచాయగా కనిపించింది అనూరాధకి. అతని అభిప్రాయం యేమిటో గ్రహించుకుందుకు అట్టేసేపు పట్టలేదామెకి. తను అతణ్ణి ప్రేమిస్తున్నట్టు, వాసు భ్రమ పడుతున్నాడన్న నిర్ణయానికి వచ్చేసింది.

"సహచర్యం సదా వుండట మేఁవిటండీ?" సూటిగా అడిగింది.

వాసు తడబడ్డాడు. ఎంతధైర్యంగా వుండాలనుకున్నాడో, అంతగా దిగాలుపడ్డాడు.

"అబ్బే! యేం లేదండీ...యేం లేదు..." నసిగేశాడు. అతని ఫాలభాగం స్వేదబిందువులతో నిండిపోయింది. చెప్పదల్చుకున్నది చెప్పలేకపోయాడు.

అనూరాధ వూహించింది అతను యేం చెప్పదల్చుకున్నాడో! అతని అంతరంగంలో యే అభిప్రాయం దోబూచులాడుతూవుందో, ఆమె గ్రహించేసింది. అతని చొరవకి ఆమెలో కోపం కట్టతెగి ప్రవహించింది. ఆమెలో సహనం నశించిపోయింది. "చూడండి వాసుగారూ, నా విషయంలో మీరేదో అపోహ పడుతున్నారు. కాని, తొందరపడి యే నిర్ణయానికీ రావద్దు. మీ ఆటను మెచ్చుకున్నంత మాత్రాన, మిమ్మల్ని మెచ్చుకున్నాననీ, మీమీద అనురాగబంధమైన అభిప్రాయాన్ని యేర్పర్చుకున్నాననీ, మీరు అనుకోవడం పొరపాటు- అభినందన యింతదూరం తీసుకు పోతుందని నే నెప్పుడూ అనుకోలేదు...

క్షమించండి..." అంటూ కళ్ళెర్రజేసి చరచరా ముందుకు సాగిపోయింది.

వాసు స్తంభించిపోయాడు. అతని మొహం వివర్ణ మయ్యింది. కాళ్ళు తడబడ్డాయి. అతని గుండెలు అతి జోరుగా కొట్టుకున్నాయి. జేబునుండి రుమాలు తీసుకుని, మొహాన్ని ఓసారి ఒత్తుకున్నాడు. అనూరాధ మాటలు యెవరైనా విన్నారేమోనని వెనుదిరిగి చూశాడు. ఎవరో నడుస్తున్నారు గాని, ప్రత్యేకించి తమమాటలు వినివుండరని నిర్ణయించుకున్నాడు. అయినా, తను యింత తెలివిహీనంగా ప్రవర్తించాడేవిటి? ప్రేమవిషయం నడిరోడ్డుమీద ఎవరైనా వ్యక్తం చేసుకుంటారా? ఛా ఛా! తనెందుకిలా తొందర పడ్డాడు? అనూరాధ, అలా అంటుం దేవిటి? తనమీద యే విధమైన అనురాగమూ లేదంటుం దేవిటి! తనే తొందరపడ్డాడా? ఆమె అభినందన స్వప్నాల్ని సృష్టించుకోవడం, తన తప్పేనా? నిజంగా ఆమెకి తనపట్ల అభిమానంగాని, అనురాగంగానీ లేవా? అయ్యుండొచ్చు. ఆమె అంత నిష్కర్షగా చెప్పుంటే, యింక నమ్మకపోవడ మేమిటి?... యీ ఆలోచనలతో వాసు బుర్ర వేడెక్కింది. నిర్మించుకున్న ఆశాసౌధం కూలిపోయేసరికి, యింక గ్రౌండుకి పోవడం యిష్టంలేక యింటిముఖం పట్టాడు.

వాసులో మార్పు వచ్చింది. అతను మొదటిలాగా వుత్సాహంగా వుండలేక పోతున్నాడు. అయినా ప్రాక్టీసుకి వెళ్తున్నాడు. తను యీ సారికూడా కామేశాన్ని ఓడించాలన్న పట్టుదల మాత్రం అతనిలో ధృఢంగావుంది. అవుతే, అనూరాధ

నిరసనకూడా అతను మర్చిపోలేక పోతున్నాడు. ఓ ప్రక్క యీ అవమానం, యీ బాధ రగిల్చేస్తున్నాయి. తను కామేశంకంటె యే విషయంలో తీసిపోయాడు?... యిదే తర్కం... కాని జవాబు యెవరిస్తారు?

కొద్దిరోజుల తర్వాత పోటీలు ప్రారంభ మయ్యాయి. ఫైనల్సుకి వాసు, కామేశం వచ్చారు. ఇద్దరిలోనూ ఓ విధమైన పట్టుదల వుంది. అనూరాధను గురించిన ఆలోచనలు యీ యిద్దరిలోనూ వున్నాయి. అవుతే కామేశం ఆలోచనలు ద్వేషముతో కూడినవి. అందుకే, వాసుని తప్పకండా ఓడించి, అనూరాధకి గుణపాఠం చెప్పాలని అనుకున్నాడు. అతనిలో నిరుత్సాహానికి ఎక్కడా స్థానంలేదు. ఇక వాసు విషయం పూర్తిగా విరుద్ధం, కామేశాన్ని ఓడించాలన్న పట్టుదలవున్నా, అనూరాధ తనపట్ల చూపిన నిరసనవల్ల నిరుత్సాహాన్ని దూరంగా వుంచలేకపోయాడు. కామేశాన్ని తను ఓడించినా, అనూరాధ తనని ప్రేమించ లేదని, ప్రేమించదని నిర్ధారణ చేసుకున్నాడు గనుకనే, ఆమె నిరసనను మర్చిపోలేక పోతున్నాడు. ఈ ఆలోచనల ఒడిదుడుకులతో అతని ఆట ఒక సమగ్రమైన స్థాయికి చేరలేకపోయింది. అందుకే పోటీలో కామేశం చేతిలో ఓడిపోయాడు వాసు. తను ఓడిపోవడానికి అనూరాధ నిరసనే కొంతవరకు కారణమని అతనికి తెలుసు. అవుతేనేం, ఆ అభిప్రాయాన్ని అభివ్యక్తం చేసుకోలేకపోయాడు. ఆరోజు వాసు అనుభవించిన ఆవేదన, బాధ వర్ణనాతీతం.

అనూరాధ వుత్సాహం వురకలు వేస్తుంటే, కామేశాన్ని సమీపించి, అతణ్ణి అభినందించింది. కామేశం, కనీసం మందహాసమైనా చెయ్యలేదు. అనూరాధపట్లవున్న ద్వేషం యింకా ఆతనిలో మాసిపోలేదు.

"వాసుని అభినందించడానికి పాపం అవకాశం లేక పోయింది, అనూరాధా!" అన్నాడు తన అక్కసు నంతా ఆ స్వరంలో నింపి.

కామేశం మాటల్లోని అంతరార్థాన్ని అర్థం చేసుకుంది అనూరాధ. చిన్నగా నవ్వింది. అంతేగాని, జవాబుచెప్పలేదు.

బహుమతులు పంచిపెట్టబడ్డాయి.

కామేశం బైలుదేరాడు. అనూరాధ అతణ్ణి అనుసరించింది. ఇద్దరూ నూతన దంపతుల్లా ప్రక్కప్రక్క నే నడుస్తున్నారు. అవుతేనేం—కామేశం మూతి బిగించుకుని గంభీరంగా వున్నాడు.

"నామీద కోపంగా వుందికదూ కామేశం?" చిన్నగా నవ్వుతూ సంభాషణ ప్రారంభించింది.

"కోపగించుకోవడానికి నాకేం హక్కుంది? పాపం, వాసు ఓడిపోయాడని చాలా బాధపడుతున్నావనుకుంటాను" అన్నాడు వెగతాళిగా.

"అక్కడే పొరబడుతున్నావు కామేశం! అతణ్ణి మొదట అభినందించానంటే, అతన్నిపైవుండే అభిమానంకొద్దీకాదు. నీలో

పట్టుదల పరాకాష్ఠ నందుకుంటుందని వూహించి, అలా ప్రవర్తించాను. అక్షరాలా నావూహా నిజమయ్యింది. అవుతే, నేను వూహించని మరో సంఘటన జరిగింది..." అంటూ ఆగి పోయింది.

కామేశం ఆమె వేపు ఆత్రంగా చూసి, "ఏఁవిటి ?" అన్నాడు.

"నేను వాసుని అభినందించడం, అతనిలో ఓ విధమైన రోగాన్ని తెచ్చింది. అదే ప్రేమరోగం. నేను అతనిని ప్రేమిస్తున్నాననీ, నా అభినందన అనురాగంతో కూడినదేననీ అతను భావించాడు. ఎన్నో స్వప్నాల్ని సృష్టించుకున్నాడు. అంతేనా ? ఓనాడు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసుకున్నాడు. ఆ సమయంలో నేనూ ఆశ్చర్యపోయాననుకో ! అసలు అతన్నిపై నాకు యేవిధమైన అభిమానంగానీ, ప్రేమగానీ లేదని ఖచ్చితంగా చెప్పేశాను. దాంతో వాసు కుంచించుకు పోయాడు. అతనిలోవున్న వుత్సాహమంతా యిగిరిపోయింది. ఇంక యేం ఆట ప్రదర్శించగలడు ? ఇప్పటికైనా అర్థం చేసుకున్నావా ?" అంది అనూరాధ.

"నా కామేశం ఓటమిని కౌగలించుకోవడం యిష్టం లేదు."

కామేశంమెదడు తీవ్రాలోచనకి గురయ్యింది. అనూరాధ ఆంతర్యాన్ని అర్థంచేసుకున్నాడు. తను వాసుని జయించడంలో

కేవలం తన ప్రతిభేవున్నా, అనూరాధని నిరుత్సాహపర్చడం అతనికి యిష్టంలేకపోయింది.

“ఓటమిని కౌగలించుకోవడం నాకేం ఖర్మ! నా అనూరాధ వుందిగా!” నవ్వుతూ అనాలోచితంగా అనేశాడు వుత్సాహాన్ని అరికట్టలేక.

అనూరాధ మొహం సిగ్గుతో యెర్రబడింది. కాని ఆ మసక వెల్తురులో కామేశం చూళ్ళేదు.

“చాల్లే కామేశం! యిది నడిరోడ్డని తెలుసుకోవడం మంచిది” మూతి ముడుచుకుంటూ అంది కోపాన్ని అభినయిస్తూ.

“ఓహో! పొరపాటే” నవ్వుతూ అనేశాడు కామేశం చిన్నపిల్లాడిలా.

అనూరాధ కూడా నవ్వకుండా వుండలేకపోయింది. ఇద్దరి నవ్వులూ మిళితమై, ఆ చల్లనిగాలిలో తరంగాల్లా తేలిపోయాయి.